# రెండు వికసించిన పుష్పాలు

పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా వధూవరులను చిలకా గోరింకలు లాగా వున్నారని మెచ్చుకొన్నారు. వాళ్ళు చిలకా గోరింకలు లాగా చిన్న చిన్నగా ఏం లేరు.

సుధ నిండుగా వుంది. చీరెకు శరీరం చాలకపోయినా కొదవేం లేదు. రవి వంగి పోనిదే వాకిలి తగులుతుంది. పెళ్ళికి వచ్చిన కూరగాయలమ్మి పెళ్ళి కూతుర్ని తోట కూర కాడలాగా వుందని, పెళ్ళి కొడుకును ములక్కాడ లాగ వున్నాడని చెప్పింది. అంతేకాదు వాళ్ళవి దొండ పళ్ళు లాంటి ముఖాలంది. టొమాటోల్లాంటి శరీరాలని వివరించింది.

ముసలాయన ఈడూ జోడు అంటే ఇలా వుండాలి. ముక్కు మీద వేలేసుకొని కళ్ళ జోడుకు అడ్డం వస్తుంటే వేలు జరుపుకొని ఊపిరి ఆడటం లేదని వేలిని ప్రక్కకు లాక్కున్నాడు.

'కళ్ళ పండగ అంటే ఇట్లాంటి జంటను చూడటమే' కొత్తగా పెళ్ళయిన యువకుడు అంటుంటే ప్రక్కనున్న భార్య మూతి మూడు వంకర్లు తిప్పింది.

ఆచార్లు పోతూ పోతూ నూరేళ్ళు బ్రతకమని ఆశీర్వదించాడు. 'రేషన్ బియ్యం' అని చమత్కరించాడు గుమాస్తా.

'దీర్ఘసుమంగళీభవ' అని దీవించాడు పెద్ద మనిషి.

పూజారి వెళుతుంటే రవి తండ్రి పిలిచి కొడుకును కోడల్ని దీవించమని అడిగాడు. రవి మిత్రుడు అడ్డుపడి మీ దీవెన ఇందాకే అందింది అనటంతో అవునవు ననుకొని పూజారి వెళ్ళిపోయాడు.

రవి మిత్రుడు కవి. రవి కాంచనిచో కవి కాంచునే కదా! కవి బహుమతులేం తేలేదు. కారణం బహుమతులు వద్దు అని పెళ్ళికి పంపిన ఆహ్వానంలో

ఉండటం కాదు. కవులు దరిద్రులు కదా! అయితే కవి వట్టి చేతులతో రాలేదు. గట్టి చేతులతో వచ్చాడు. చేతులైతే గట్టివే! అందులోనివి అతి మెత్తనివి.

అవి రెండు వికసించిన పుష్పాలు. అసలు సిసలైన గులాబి పూలు. ఎంత ఎరుపు! ఎంత అందం! ఎంత వయ్యారం! కవి పూలు మాత్రమే తేలేదు. వాటితో పాటు ఘాటి కాడలు తెచ్చాడు. అల్లాటప్పా ముళ్ళు కావు. వీలు తప్పి పట్టు కొంటే వేళ్ళోకి దిగుతాయి. నొప్పి పెడతాయి. దురద పెడతాయి. నెత్తురు గూడు కడతాయి.

కవి రవికి తన చేతుల్లోని గులాబీలు రెండు అందించాడు. 'ఏమిటిరా ఇది' అన్నాడు రవి. అన్నాలనుకొని అనలేదు. ఏదో అనవలసి వచ్చి అన్నాడు. 'ఎందుకురా ఇవి' అన్నట్లు అనిపించి. కవి సమాధానం చెప్పాడు. 'మీకే' రవి ఏదో అన్నాడే కాని ఎంతో ఆనందం కలిగింది. ఎందుకంటే గులాబీలు సుధకు వల్లమాలినంత ఇష్టం.

సుధ వాటి వైపు చాక్లెట్ల కోసం నోరూరుతూ చూసే పసి పిల్లలాగా చూస్తూ వుంది. ఎంత పెద్ద పూలు! ఎంత చక్కని రంగు. 'నీ కోసమే' అన్నాడు రవి. అవునన్నట్లు తలూపాడు కవి. తలలో పెట్టమని అందరూ సతాయించటంతో రవి సుధ తలలో గులాబీ తురిమాడు. అంతటితో వూరుకొంటే వాళ్ళు పెళ్ళికి వచ్చిన వాళ్ళెందుకు అవుతారు. సుధను మరో పువ్వు పుచ్చుకొని రవి కోటుకు పెట్టమన్నారు. తప్పుతుందా మరి అదేమో పెళ్ళి. దాని కెన్ని తంతులు! ఎవరి వేడుకలు వాళ్ళవి! మేమంతా పట్టుబట్టి గులాబీ పూవు కోటుకు గుచ్చేటట్టు చేశామని పెళ్ళికి వచ్చిన వాళ్ళకు ఆనందం.

నేను గనక కోటులో పూవు గుచ్చ గలిగానని సుధకు వంగిన తల లేచటంలో అతిశయం. నేను కాబట్టి కోటులో పూవు పెట్టించుకొన్నానని కాలరు ఎగురుతూ వుండగా రవికి సంతోషం! అయితే పెళ్ళికి వచ్చిన వాళ్ళు చప్పట్లు కొట్టారు. కాని సుధారవులు మాత్రం మౌనంగా ఉన్నారు.

మౌనంలో ఎన్ని మాటలో! ఎన్ని ధ్వనులో! ఎన్ని భాషలో! పెళ్ళిబాగా జరిగిందని అందరూ అనుకొన్నారు.

పిల్ల తండ్రి బాగా కట్నం కానుకలు ముట్ట చెప్పాడని చెవులున్న వాళ్ళు కొరుక్కుంటున్నారు. నొప్పి పుడితే వూరుకొంటున్నారు లేకపోతే కొరుకులాట కొనసాగుతూ ఉంది. 'ఏం ఉన్న ఆస్తి అంతా ఏం చేసుకొంటాడు?' అన్నాడొక గొడుగు యజమాని, ఉందని ఊపుకొంటూ.

డబ్బు ఎవరికన్నా చేదా! అక్కడ ఉన్న వాళ్ళు చిన్న వాళ్ళు అనుకొంటూ వుండవచ్చు. ఎవరూ ఏమీ అడగలేదు. గొడుగు ఉందని ఊపకుండా ఉండలేని యజమాని నోరును ఊరకే ఉండనిస్తాడా!? చెప్పేశాడు. (ఒక్కగానొక్క కూతురు.)

ఎవరో అన్నారు 'అయితే మాత్రం?'

యజమాని చెప్పేశాడు. 'లక్షల ఆస్తి ఏడుతరాలు కాలుమీద కాలేసుకొని కూర్చుని తిన్నా తరగదు.'

'కొడుకుల్లేరా ?'

'సుధే కొడుకయినా కూతురయినా'

'సరిపోయే ! - పిల్లలు గలగలేదా? వద్దనుకొన్నారా?'

'అది మనకు తెలియదు'. ఉన్న గొడుగు ఊపుకొంటూ యజమాని వెళ్ళిపోయాడు.

సుధ తల్లి ఈ మాటలు చూచాయగా వింది.

గతం కళ్ళముందు తిరిగింది. పెళ్ళయిన పదేళ్ళదాకా పిల్లలు కలగకపోతే అత్తపోరు భరించలేక పోయింది. పైకి ఏమీ అనలేదు కాని లోలోపల పిల్లలు లేకపోతే నష్టమేమీ కనిపించటం లేదు. పైకి 'ఇదే బాగుంది', అనుకోవటమేమో అనుకొంది. కాని పిల్లల్లేకపోతే ఎలా అని పదేళ్ళయ్యే సరికి కుమిలి పోసాగింది. నోములు నోచింది. యాత్రలు చేసింది. పుణ్యస్థలాలు చూచింది పుణ్యతీర్థాలలో మునిగింది. పసుపు కుంకాలు తెచ్చుకొంది. పవిత్రతను తెచ్చుకొంది. ప్రయోజనం లేదు. ఏడుస్తూ భర్త ఎదురొమ్ము మీద పడి విలవిలలాడింది. గిలగిల కొట్టుకొంది.

నెలతప్పిందని, నిల్చిందని తెల్సిన రోజుల్లో ఆమె ఆనందం పట్టరానిది. హద్దులులేనిది. అంతంలేనిది. అయ్యో అది ఆనందం. ఈ సంగతి అంతావిన్న ఆమె భర్త ఎగిరి గంతేశాడంటే నమ్మలేం కాని, కూర్చొన్న చోట కూర్చోలేదు. ఉన్నచోట ఉండలేదు. ఏం అంటున్నాడో ఏం వింటున్నాడో తెలియటం లేదు. పిల్లికి కాలుకాలితే ఏం చేస్తుందో తెలియదు కానీ, ఈయన మాత్రం వొళ్ళు కాలినట్లు తిరిగాడు. నవ్వాడు. భార్యదగ్గరకు పోతాడు. చూస్తాడు. నవ్వుతాడు. తిరిగి వస్తాడు. ఎటుపోతాడో తెలియదు' అదీ ఆయన ఆనందం.

భార్యను పరీక్షించిన డాక్టరు కానుపు కష్టమవుతుందని చెప్పి జాగ్రత్తలన్నీ ఏకరువు పెట్టింది. అన్ని జాగ్రత్తలు తీసుకోవటానికి ఏమీ, అభ్యంతరం లేదు. కాని కష్టం గట్టెక్కుతుందని హామీలేదు.

గండం గడిచి పిండం బయట పడితె చాలురా భగవంతుడా! అని ఎదురైన గుడికి, కనపడ్డ దేవుడికి, విగ్రహాలకు మొక్కుతూ కాలం గడిపారు. ఈ కానుపుకు ఎలాగో అవస్థ పడవచ్చు కాని రెండవ కాన్పు చేయవలసి వస్తే పెద్ద ప్రాణానికే ముప్పు అని డాక్టరు చెప్పినపుడు భార్యాభర్తలేం మాట్లాడలేదు.

అవునలాగే చేద్దాం అంటే మాట తప్పరాదు.

అలా వీల్లేదంటే డాక్టరు తిట్లకు తలఒగ్గాలి. అందుకని ఏమీ అనకుండా కూర్చున్నారు. అట్లా చేద్దాంలే అనే మనస్సులో అనుకొన్నారు.

కూతురు పుట్టింది. ఆ అమ్మాయే సుధ. తల్లీ బిడ్డా క్షేమంగా వున్నారు.

ఎంతో కష్టం అంది, కాని ఏమీ కష్టం లేదని తండ్రి తలక్రిందులవుతున్నప్పుడే డాక్టరు వచ్చి చల్లగా చెప్పింది. ఆమెకింక పిల్లలు కలగరు. బిడ్డసంచి తీసివేయవలసి వచ్చింది.

అదేందో అర్థం కాకపోయినా బాధకలిగింది.

పూర్తిగా తెల్సిం తర్వాత తల తిరిగిపోయింది.

అయితే ఒకటే ఓదార్పు! తల్లీపిల్లా బావున్నారు.

కొడుకు పుడితే బాగుండును కాని, ఎందుకో ఊరికే ఊరుకొన్నాడు.

మళ్ళీ పెళ్ళిమాట అనుకొన్నాడు. ఎందరో అన్నారు. భార్య కూడా అంది కాని 'పోనిద్దూ' అని పూరుకున్నాడు.

పెళ్ళిపందిట్లో నలుగురూ పోగై చెప్పుకొన్న మాటలు విన్న సుధ తల్లి 'ఆయన మంచితనం వీళ్ళకేం తెలుసు' అని అస్పష్టంగా గొణుక్కొంది.

సుధారవుల చుట్టూ జనం గుమిగూడివున్నారు.

పట్టపగలు పన్నెండు గంటలు ఆకాశంలో అరుంధతి నక్షత్రం.

పట్టుబట్టి పదిమంది చూపిస్తున్నారు. ఇద్దరు చూస్తున్నారు.

'అటు' అన్నారొకరు!

'అటు అటు' అన్నారింకోరు!

'అదుగో అక్కడే' అన్నారు మరొకరు!

మొత్తంమీద అందరూ కలిసి అరుంధతి నక్షత్రాన్ని చూపించారు. కనిపించటం లేదని మొత్తుకొని, మొండికెత్తి, మొరాయించి సుధారవులు చెప్పిచూశారు. శత్రు పరాజయం బాధ్యతగా భావించే వీరుల్లా వాళ్ళు కనిపించిందని చెప్పకపోతే పూరుకోనేటట్లు లేరు జనం.

అప్పుడే జనం గోల ప్రారంభమయింది. 'పెళ్ళి కూతురికి కళ్ళు సరిగా కనిపించవా ?'

'రవీ ! కళ్ళజోడు పెట్టుకొని చూడు !' ఇదీ తంతు.

ఎందుకొచ్చిన గోలని ఇద్దరూ పట్టపగలు అరుంధతి నక్షత్రం దివ్యంగా కనిపించిందని ఒప్పేసుకొన్నారు. ఎవరయినా ఎలావుందని అడిగితే పెట్రోమాక్స్ లైటులాగావుందని కూడా చెప్పేవాళ్ళు.

లోపలికి వస్తున్న కొడుకును కోడల్ని చూస్తూ నెరిసిన మీసాల మాటున నవ్వును సీలుచేసి కనురెప్పలకి, నవ్వు నేర్పి సుతారం చేశాడు తండ్రి.

ప్రక్కనే చేరిన మనిషి 'ఏం బావా ?' అంటే 'ఏం బావా?' అని పలికాడు రవి తండ్రి.

'ఏమాత్రం సంపాదించావ్ ఈ వ్యవహారంలో' అని అడిగాడు. రవి తండ్రి నవ్వలేదు. కళ్ళు సవ్వేశాయి.

ఆ బావ ఇక్కళ్ళేడు. ఊహల్లోకి తమ వూళ్ళోకి వెళ్ళిపోయాడు

తన తండ్రికి తాను ఎనిమిదో సంతానం, తండ్రి పెంచిందే పుణ్యం. పంచి యిచ్చింది ఏమాత్రం? పెళ్ళిచేసి, ఒక ఇంటివాణ్ణిచేసి, పొట్టపోసుకోనటానికి ఇంత ఆస్తి ఇచ్చిందే ఘనం. తనేం చదువుకోలేదు. అక్షరాలు రావనికాదు. డిగ్రీలులేవు. చదువుకోలేదంటే ఈ చదువులు చదువలేదు. పెద్ద బాలశిక్షవచ్చు. లోకం కంఠోపాఠంగా చదివాడు. దానితో మెలగటంలో రవి తండ్రి ప్రవీణుడు. పెళ్ళయి సంవత్సరం తిరక్క ముందే తండ్రి అయ్యాడు.

అంతా 'తండ్రి చాలు' అన్నారు. తను తండ్రి అయితే అయ్యాడు కానీ కొడుకు మాత్రం పోయాడు. వాడికేం పనివుందో పుట్టీ పుట్టక ముందే పాసు పోర్ట్ వున్న వాడిలా వెళ్ళిపోయాడు. రెండోవాడు రెండో ఏటికి హాజరుపలికాడు. పలికిన నోటికేమయిందో మళ్ళీ పలకలేదు. నలుగురు పుట్టి నాలుగు దిక్కులను పాలించ టానికి తరలి వెళ్ళింతర్వాత పుట్టిన రవి దిక్కు లేనివాడిలా బ్రతికాడు. ఆ తర్వాత కొడుకు పుడతాడేమోనని చూశాడు. పుడితే ఒట్టు! పుట్టలేదంటే పాపం! పుట్టారు. పుట్టింది మగపిల్లలు కాదు ఆడపిల్లలు బ్రతికారంటే అన్యాయం, పోయారు. గెరిగిసినట్టు నలుగురు పోయింతర్వాత పుట్టిన కూతురు బ్రతుకుతుందని తండ్రి అనుకొన్నట్లు బ్రతికింది. బట్ట కట్టింది. చీర కట్టింది. అన్నకంటే ముందే అత్తవారిల్లు చూచింది. కన్న కొడుకుతో అన్న పెళ్ళికి వచ్చింది. పసి పిల్ల తల్లి.

కూతుర్ని ప్రేమించానని వచ్చిన వాడిని వూరడగలేదు, పేరడగలేదు, ఆస్తడగలేదు.

'నిజమేనా?' అన్నాడు

కూతురు 'నిజమే' అంది

'రైట్' అన్నాడు.

బస్సు బయలుదేరింది, ఖర్చులేదు, కట్నంలేదు, కానుకాలులేవు. అంతగొప్ప ఉద్యోగి అల్లుడు కావాలంటే ఈయన ఎన్ని సంవత్సరాలు తపస్సుచేసి ఉండవలసి ఉంటుందో అని అంచనా వేసిన వాళ్ళకు బదులులేదు. అంచనాకు అందలేదు.

తండ్రి దగ్గర పంచుకొన్నది అంతంత మాత్రం, ఆస్తిని ఇంతగా ఎలా పెంచాడో అని ఎవరయినా అడిగితే 'తినలేదు' అని జవాబు వింటారు. కాని అది నిజంకాదు. తినందే బతకలేరు. పిల్లల్ని పెంచలేరు. అంత అందంగా, పోనీ షోకుగా, పోనీ విలువగా పెంచలేరు. అందువల్ల బాగానే ఖర్చుపెట్టాడు. అయితే దుబారా చేయలేదు.

రవి తండ్రి విషయంలో కాసుకు కాసు ముడి వేస్తాడనే ఖ్యాతి వుంది. అది తప్పని ఎవరూ అనలేదు. కాని నిందగా మాత్రం అంటారు. బావలు మరీను! అవకాశం దొరికితే ఆవకాయ తిన్నట్టే. రవి తండ్రికి జీవితమంతా రాబడే! పెళ్ళి పెద్దరాబడి. దానికాయన పొంగిపోయాడు. పొగరులేదు. నిరాడంబరంగా జీవించాడు. కాబట్టే కూడబెట్టాడు. నలుగురికి కూడు బెట్టాడు. ఈ ఆస్తి నాదా అనుకొంటాడు కానీ రెండు ఇళ్ళ ఆస్తికి తన కొడుకు వారసుడైతే అంతకంటే తనకేం కావాలి.

రెండు గులాబి పూలను చూశాడు. ఒకటి తలలో! ఒకటి కోటులో! అవి పూలుగా స్త్రీ పురుషులుగా కనిపించటం లేదు, అవి ఆస్తులు!

శోభనం గదిలో ప్రవేశించిన సుధ తనతో రెండు గులాబీలను తెచ్చింది. లవకుశులు రాముడి యజ్ఞాశ్వాన్ని పట్టుకొని నిలబడ్డ పటం ముందు పెట్టింది. పగలు వడగాలి. రాత్రి హాయిగా వుంది. వెన్నెల కాలంతో నిమిత్తం లేకుండా కాస్తూ వుంది. గదిలో మల్లెపూలు మత్తువాసనలు వెదజల్లుతున్నాయి. విశాలమయిన గదిలో విశాలమయిన మంచం. మల్లెపూల మాలలు చేతులు పట్టుకొని నాట్యమాడుతున్నాయి. నవ్వుకొంటున్నాయి. చల్లనిగాలి రివటవచ్చి పూవుల్ని వెనక్కి నెట్టింది. పెనుగాలి పూలను ముందుకు నెట్టింది. పూలు అటూ ఇటూ అవుతున్నాయి. చివరికి ఒకటి అయ్యాయి. అవి ఇప్పుడు రెండు వికసించిన పుష్పాలు.